ప్రజా సమస్యల పరిష్కారానికి సీపీఐ అలుపెరగని పోరాటం



జెండావిష్కరణలో పాల్గొన్న పార్టీ నాయకులు

నాగోలు: దేశంలో అసమానతలు లేని సమాజ నిర్మాణ కోసం త్యాగాలు చేసిన చరిత్ర భారత కమ్యూనిస్టు పార్టీ(సీపీఐ) అన్ని సరూర్‌నగర్ మండల కార్యదర్శి బాతరాజ నరసింహా అన్నారు. సీపీఐ పార్టీ 100 ఆవిర్భావ దినోత్సవం భాగంగా నాగోలు డివిజన్‌లో సరూర్‌నగర్ మండల సహాయ కార్యదర్శి కందుల సుధాకర్ అధ్యక్షతన మన్సూరాబాద్ డబుల్ బెడ్రూమ్ వద్ద ఏర్పాటు చేసిన జెండా ఆవిష్కరణలో బాతరాజు నరసింహా పాల్గొని జెండాను ఎగరవేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రజల సమస్యల పరిష్కారం కోసం అలుపెరుగని పోరాటలు చేస్తోందన్నారు. దున్నేవాడికి భూమి అనే నివాదంతో లక్షలాది ఎకరాలు పేదలకు పంచిందన్నారు. అమరవీరుల ఆశయ సాధన కోసం నిరంతరం కమ్యూనిస్టు పార్టీ నాయకులు పేదల పక్షాన పోరాడుతూనే ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో పూజారి అనిత, శోభ, లింగస్వామి, శ్రీనివాస్, దుండిగల్ లక్ష్మి, కట్ట పార్వతమ్మ, యాది రెడ్డి, విక్రం పాల్గొన్నారు.



సరూర్‌నగర్‌లో..

ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం..

దిల్‌సుఖ్‌నగర్: భారతదేశ గడ్డపై భారత కమ్యూనిస్టు పార్టీ(సీపీఐ) వందేళ్లు పూర్తి చేసుకుందని బాతరాజు నరసింహా అన్నారు. గురువారం పార్టీ 100 ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మండల పరిధిలోని వివిధ డివిజన్ పరిధిలో పార్టీ జెండా ఆవిష్కరణ చేశారు. ఆయన మాట్లాడుతూ.. దేశంలో నిరంతరం ప్రజల సమస్యలపై పోరాటం చేసే పార్టీ సీపీఐ ఒకటేనని పేద ప్రజలకు అండ సీపీఐ పార్టీ జెండా అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కృష్ణ, యాదగిరి పాల్గొన్నారు.

తవ్వేశారు.. వదిలేశారు!

- డ్రైనేజీ లైన్ల కోసం రోడ్ల తవ్వకాలు
- పనులు పూర్తయినా మరమ్మతుకు నోచుకోని వైనం
- రాకపోకలకు ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు

నాగోలు: డ్రైనేజీ లైన్ల కోసం రోడ్లను తవ్విన జలమండలి అధికారులు పనులు పూర్తయిన తర్వాత వాటికి మరమ్మతు చేపట్టకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎల్‌బీనగర్ నియోజకవర్గం పరిధిలోని సరూర్‌నగర్ సర్కిల్ పరిధిలో వివిధ కాలనీలో మురుగునీరు సాఫీగా వెళ్లేందుకు జలమండలి అధికారులు రోడ్లను తవ్వి నూతన భూగర్భ డ్రైనేజీ లైన్లను నిర్మించారు. అయితే పనులు పూర్తయి నెలలు గడుస్తున్నా మళ్లీ రోడ్డు వేసేందుకు సంబంధిత ఇంజినీరింగ్ అధికారులు ముందుకు రాకపోవడంతో స్థానిక కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

అధికారుల దృష్టికి తీసుకెళ్లినా..

కొత్తపేట డివిజన్ పరిధిలోని మోహన్‌నగర్ ఎస్‌బీహెచ్ కాలనీ, ఎస్ఆర్ఎల్ కాలనీ, సత్యనగర్ కాలనీ, నాగేశ్వర్‌రావు కాలనీ, ఎల్‌బీనగర్‌లోని ఆర్టీసీ కాలనీ, శ్రీనివాస్ కాలనీ, భరత్‌నగర్ కాలనీ, రాజీవ్‌గాంధీనగర్, కొత్తపేట విలేజ్‌తో ఇతర ప్రాంతాలల్లో డ్రైనేజీ కోసం ఇష్టానుసారంగా రోడ్లను తవ్వి వదిలేశారు. వివిధ ప్రాంతాల్లో ధ్వంసమైన రోడ్లుతో కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. భరత్‌నగర్ కాలనీలో డ్రైనేజీ సమస్యతో కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే కొత్తపేట కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ అధికారులపై ఒత్తిడి తెచ్చి నూతన డ్రైనేజీ పైపులైన్ వేసి సమస్యను పరిష్కరించారు. దీంతో జలమండలి అధికారులు మాత్రం గతంలో డ్రైనేజీ వేసిన స్థానంలో గుంతలను పూడ్చాల్సిన జలమండలి అధికారులు పట్టించుకోకపోవడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయని వాపోతున్నారు. మోహన్‌నగర్ ఎస్‌బీహెచ్ కాలనీలో దాదాపు సంవత్సరం క్రితం డ్రైనేజీ పైప్‌లైన్ పనులు పూర్తి చేశారు. అందుకోసం బీటీ రోడ్డును తవ్వి నిర్మాణా లు చేశారు. జలమండలి అధికారులు తమ పనులు పూర్తి అయిపోయాక రోడ్డుపై గుంతలను పూడ్చాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రమాదాలకు అడ్డాగా మారాయి. ఈ విషయమై ప్రజా ప్రతినిధులకు, అధికారులకు పలుమార్లు కాలనీ వాసులు ఫిర్యాదులు చేసిన పట్టించుకోవడం లేదని కాలనీ సంక్షేమ సంఘం నాయకులు ఆరోపిస్తున్నారు.



మోహన్‌నగర్‌లో ఇలా..



కొత్తపేటలో గుంతమంగా రోడ్డు

ప్రమాదాలకు నిలయాలుగా..

కొత్తపేట గ్రామంలో వివిధ గల్లీల్లో రోడ్లను మట్టితో పూడ్చారే తప్ప సీసీ వేయలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. కొత్తపేటలోడివిజన్‌లోని ఎస్ఆర్ఎస్ కాలనీ నుంచి మూసీ వరకు గతంలో బాక్స్ డ్రైనేజ్ పనులు చేపట్టారు. కాలనీ వెళ్లే ప్రధాన మార్గం కావడంతో రోడ్డు ధ్వంసం చేసి బాక్స్ డ్రైనేజీ పనులు చేపట్టారు కాని అక్కడ నూతన రోడ్డు నిర్మాణం చేయలేదు. వివిధ కాలనీలకు వెళ్లే ప్రధాన మార్గం కావడంతో విద్యార్థులు, కాలనీవాసులు, వాహనదారులు గుంతల రోడ్డుపై నడవలేని పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై స్థానికులు అధికారుల చుట్టూ తిరుగుతున్నా ఎలాంటి స్పందన లేదని ఉన్నతాధికారులు స్పందించి ధ్వంసమైన రోడ్లకు మరమ్మతు చేసేలా చర్యలు చేపట్టాలని ఆయా కాలనీలవాసులు కోరుతున్నారు.



కొత్తపేట డివిజన్ మోహన్‌నగర్‌లో డ్రైనేజీ కోసం తవ్వి వదిలేసిన రోడ్డు

రైతు బజార్‌లలో కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్, వనస్థలిపురం రైతుబజార్‌లలో కూరగాయల ధరలు. టమాట రూ. 13, వంకాయ రూ. 18, బెండ రూ. 23, పచిమిర్చి రూ. 35, కాకర రూ. 32, బీర రూ. 35, క్యాబేజి రూ. 13, ఫ్రెంచిబీన్స్ రూ. 45, క్యారట్ రూ. 27, దొండ రూ. 40, చిక్కుడు రూ. 35, గోకర రూ. 28, బీట్‌రూట్ రూ. 35, క్యాప్సికం రూ. 47, ఆలు రూ. 25, దోస రూ. 15, సొరకాయ రూ. 11, పొట్లకాయ రూ. 13, ఉల్లిగడ్డ రూ. 34, చామగడ్డ రూ. 37. ఈ ధరలు శుక్రవారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

సాగర్ రింగ్ రోడ్డు వద్ద దారి దోపిడీ

నాగోలు: పశువుల మేత కొనేందుకు వచ్చిన ఓ రైతును గుర్తు తెలియని యువకులు బెదిరించి సెల్‌ఫోన్, నగదు లాక్కొని పారిపోయిన ఘటన ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం..రంగారెడ్డి జిల్లా, మంచల్ మండలం, రంగాపూర్ గ్రామానికి చెందిన కుకుదల మాధవరెడ్డి రైతు. ఈ 24న మాధవరెడ్డి ఎల్‌బీనగర్ బైరామల్‌గూడలో పశువుల మేత కోసం వచ్చాడు. మేత కొనుగోలు చేసిన తర్వాత రాత్రి గ్రామానికి వెళ్లేందుకు సాగర్ రింగ్ రోడ్డు వద్ద బస్సు కోసం వేచి ఉన్నాడు. ఆటోలో వచ్చిన ముగ్గురు గుర్తుతెలియని వ్యక్తులు మాధవరెడ్డిని బెదిరించి సెల్‌ఫోన్, జేబులో ఉన్న కొంత నగదు లాక్కొని పారిపోయారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.



సమావేశంలో పాల్గొన్న సభ్యులు

పాలక మండలి సమావేశం

వనస్థలిపురం: వనస్థలిపురంలోని శ్రీభ్రమరాంభికా సమేత మల్లికార్జున స్వామి దేవస్థానం పాలక మండలి సభ్యులు గురువారం సమావేశమై దేవాలయం అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై పలు నిర్ణయాలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు శ్రవణ్‌కుమార్, కార్యదర్శి చౌదరి దివాకర్ లింగం, శైలేష్, బాలు మహేంద్ర, సతీష్, మల్లికార్జున్, తీర్థయ్య స్వామి, చంద్రమౌళి, నందీశ్వర్, శ్రీశైలం, మల్లికార్జున్ పాల్గొన్నారు.

మాదిగల మహాగర్జనను జయప్రదం చేయాలి



సుదర్శన్

మలక్‌పేట: ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఎస్సీ వర్గీకరణ చేయాలని కోరుతూ తలపెట్టిన 'మాదిగల మహా గర్జన'ను జయప్రదం చేయాలని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గంటా సుదర్శన్‌మాదిగ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సుప్రీంకోర్టు తీర్పు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ చేయకుండా ఉద్యోగ నియమాకాలు చేపట్టరాదన్నారు. వర్గీకరణతోనే మాదిగ, మిగతా కులాల అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపయ్య నేతృత్వంలో జనవరి 19న హైదరాబాద్‌లో మాదిగల మహాగర్జన జరుగుతుందన్నారు. మహాగర్జన సందర్భంగా నగరంలో భారీ స్కూటర్ ర్యాలీ నిర్వహిస్తామన్నారు.

కులాల వారీగా లెక్కలు తీయాలి

నాగోలు: కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో జరగబోయే దేశ జనాభా గణనలో కులాల వారీగా లెక్కలు తీయాలని బీసీ కులాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు బ్రహ్మయ్య డిమాండ్ చేశారు.శుక్రవారం కొత్తపేటలో బీసీ కులాల ఐక్య వేదిక రాష్ట్ర కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బ్రహ్మయ్య, ప్రధాన కార్యదర్శిగా ఎల్లయ్య, కన్వీనర్‌గా వినయ్‌కుమార్, కోశాధికారిగా మధు, ఉపాధ్యక్షులుగా శ్రీను, యూత్ అధ్యక్షులుగా నాగిళ్ల జగన్, యూత్ ప్రధాన కార్యదర్శి గాశ్రీనివాస్, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులుగా కుంచాల బ్రహ్మయ్య, ప్రధాన కార్యదర్శిగా ఆమనిగంటి లక్ష్మణ్, ఉపాధ్యక్షులుగా గుండ్రనరం చంద్రశేఖర్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా శంకర్ స్వామి, ఎల్‌బీనగర్ ప్రధాన కార్యదర్శిగా లింగన్న నియమించి నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా బ్రహ్మయ్య మాట్లాడుతూ.. దేశంలో జనాభా లెక్కలు లేకపోవడంతో రిజర్వేషన్ల శాతం నిర్ణయించడంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు.



నియామక పత్రాలు అందజేస్తున్న బ్రహ్మయ్య

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



యోగాసనాలు వేస్తున్న విద్యార్థి

మహేశ్వరం: మండల పరిధిలోని మొహబ్బత్‌నగర్ గ్రామ సమీపం శ్రీశైలం జాతీయ రహదారి పక్కన ఉన్న అవేర్ మాధవన్‌జీ కేంద్రంలో యోగా విద్య వికాస కేంద్రం ఆధ్వర్యంలో గురువారం యోగా పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. యోగా సాధనతో మానసిక స్థితి మెరుగుపడుతుందన్నారు. శరీరంలో రక్త ప్రసరణ మెరుగుపడడంతో పాటు రక్త పోటు తగ్గుతుందన్నారు. ప్రతి ఒక్కరూ యోగా చేసి ఆరోగ్యంగా ఉండాలని యోగా గురువు మోహన్‌బాబు తెలిపారు. అవేర్ సంస్థలో యోగా విద్య వికాస కేంద్రాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. అంతకుముందు పలువురు యోగా ఆసనాలు చేశారు. ప్రతిభ కనబర్చిన వారికి నిర్వాహకులు బహుమతులు అందజేశారు.

బీటెక్ విద్యార్థి అదృశ్యం



అరవింద్ రెడ్డి

హయత్‌నగర్: తరచూ ఫోన్‌లో మాట్లాడుతున్నాడని తల్లి మందలించడంతో ఓ విద్యార్థి ఇంటి నుంచి వెళ్లిపోయిన ఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. అబ్దుల్లాపూర్‌మెట్టు మండలం మునుగనూరు వేద విద్యానగర్‌కు చెందిన అరవింద్‌రెడ్డి(19) బీటెక్ చదువుతున్నాడు. గత కొంత కాలంగా ఫోన్‌లో ఎక్కువగా మాట్లాడుతూ చాటింగ్ చేస్తూ తిరుగుతున్నాడు. గమనించిన తల్లి అతన్ని మందలించింది. మనస్తాపానికి గురైన అరవింద్ రెడ్డి బుధవారం సాయంత్రం ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు బంధువులు, స్నేహితులతో ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో గురువారం తండ్రి రాజశేఖర్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

హుక్కా సెంటర్‌పై పోలీసుల దాడి



మలక్‌పేట: హుక్కా సెంటర్‌పై పోలీసులు దాడి చేసిన ఘటన మలక్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై సురేష్ వివరాల ప్రకారం.. మలక్‌పేట సూపర్‌బజార్ సమీపంలో ఉన్న పీవీఆర్ మాల్ పక్కన కేఫ్ బ్లాక్ పాట్ అండ్ కేఫ్ పేరిట భవనంలోని రెండో అంతస్తులో హుక్కా సెంటర్ నిర్వహిస్తున్నారు. సమాచారం అందుకున్న సౌత్ఈస్ట్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు బుధవారం రాత్రి దాడి చేశారు. మొఘల్‌పురా వాటర్ ట్యాంక్ ప్రాంతానికి చెందిన కేఫ్ క్యాషియర్, సబ్ ఆర్గనైజర్ మహమ్మద్ అజీమ్(24), చంచల్‌గూడ, కాలడేరా చెందిన ఎతేషామ్ మెహదీ(24), అదే ప్రాంతానికి చెందిన అజాన్ మెహదీ((20) అస్లాం హల్దోర్(40)ను అదుపులోకి తీసుకున్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న ముత్తినేని వీరయ్య

మన్సూరాబాద్: రక్తదానం ప్రాణదానంతో సమానమని రాష్ట్ర వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి జన్మదిన వేడుకలను పురస్కరించుని మన్సూరాబాద్‌లోని ప్రసిద్ధ హాస్పిటల్‌లో గురువారం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని వీరయ్య ప్రారంభించి మాట్లాడారు. ప్రతి ఒక్కరు రక్తదానం చేసి ఇతరుల ప్రాణాలను రక్షించటంలో పాలుపంచుకోవాలని కోరారు. ప్రసిద్ధ హాస్పిటల్ యాజమాన్యం చొరవతో రక్తదాన శిబిరం ఏర్పాటు చేయటం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ ఎండీ జూకుని చైతన్యరాజు వర్మ, రాజు పాల్గొన్నారు.

కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు



మన్సూరాబాద్: వైదికవిజ్ఞాన ట్రస్ట్, ధర్మరక్ష సంస్థ ఆధ్వర్యంలో నాగోలు డివిజన్ పరిధిలోని జనప్రియ ఎన్‌క్లేవ్‌కాలనీ పార్కులో వేద హవనం సహిత గజేంద్ర మోక్ష ప్రవచన పాంచాహ్నిక జ్ఞాన మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. గురువారం ఏకాదశి స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకుని శ్రీలక్ష్మి నర్సింహాస్వామి విశేష కలాశాభిషేకం, తిరుమంజనంను కనుల పండువగా నిర్వహించారు. అనంతరం భద్రాచల ఆస్థాన వేద పండితులు గుదిమెళ్ల మురళీకృష్ణమాచార్యుల ప్రవచనాలు ఆకట్టుకున్నాయి.

'శ్రీ శూద్రగంగ' పుస్తకావిష్కరణ

కవాడిగూడ: సినీగేయ రచయిత సుద్దాల అశోక్ తేజ రచించిన శ్రీ శూద్రగంగ (కావ్య రూపం) పుస్తకాన్ని గురువారం పుస్తక ప్రదర్శనలో ఆవిష్కరించారు. యోగి వేమన విశ్వవిద్యాలయం తెలుగు శాఖ ప్రొ. వినోదిని మాదాసు అధ్యక్షతన తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొ. కాసీం, లోకకవి అందెశ్రీ, ప్రముఖ సినీ నటుడు, రచయిత ఉత్తేజ్, ప్రముఖ కవి విమర్శకులు బెల్లి యాదయ్య, కోయి కోటేశ్వర్‌రావులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సుద్దాల అశోక్‌తేజ మాట్లాడుతూ... ఈ భూమి శూద్రభూమి, శ్రామికుల భూమి, గంగ కూడా శూద్రులదేనని అందుకే ఈ శూద్ర గంగా పుస్తకాన్ని రచించినట్లు పేర్కొన్నారు. ప్రొఫెసర్ కాసీం మాట్లాడుతూ... చాలా స్పష్టమైన అవగాహనతో కావ్యానికి మొట్టమొదటిసారి ఓ గొప్ప పేరు పెట్టిన కవి గుర్రం జాషువా అని ఆయన రచించిన కావ్యానికి 'గబ్బిలం'అని పేరుపెట్టినట్లు తెలిపారు. అనంతరం అందె శ్రీ, ఉత్తేజ్ తదితరులు ప్రసంగించిన వారిలో ఉన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సుద్దాల అశోక్‌తేజ, ప్రొ. కాసీం, సినీ నటుడు ఉత్తేజ్

అభివృద్ధి పనుల పరిశీలన

హస్తినాపురం: డివిజన్ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతానాయక్ అన్నారు. వివిధ కాలనీల్లో జరుగుతున్న పనులను గురువారం ఆమె పరిశీలించి మాట్లాడారు. ఆయా కాలనీల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో స్థానికులు భాగస్వాములైతే సకాలంలో పూర్తవుతాయన్నారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ప్రజలకు మౌలిక వసతులు కల్పించేందుకు తగిన చర్యలు తీసుకుంటామన్నారు.



కార్యాలయాల్లో ఆర్‌టీఐ బోర్డులు ఏర్పాటు చేయాలి

కాచిగూడ: సమాచార హక్కు చట్టం సాధన కమిటీ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడిగా చింతల రాఘవేందర్ ముదిరాజ్‌ను నియమించినట్లు కమిటీ జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు డా. చంటి ముదిరాజ్ తెలిపారు. ఈ మేరకు గురువారం రాఘవేందర్‌కు నియామకపు పత్రాన్ని ఆయన అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. సమాచార హక్కు చట్టం సామాన్యుడి చేతిలో వజ్రాయుధం లాంటిదని అన్నారు. సమాచార హక్కు చట్టాన్ని ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో పకడ్బందీగా అమలు చేయాలన్నారు. ఆర్‌టీఐ బోర్డులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజలు కోరిన సమాచారాన్ని 30 రోజుల్లోపు అందజేయాలని అన్నారు. వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం కలిగినప్పుడు, ప్రాణహాని ఉన్నప్పుడు కేవలం 48గంటలలో సమాచారం అధికారులు ఇవ్వాలని కోరారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు



హుడాకాంప్లెక్స్: చెట్లకొమ్మల తొలగింపు, మరమ్మతుల కారణంగా శుక్రవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని సరూర్‌నగర్ డివిజినల్ ఇంజినీర్ కే.రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ హరిపురి కాలనీ ఫీడర్ పరిధిలోని కాలనీల్లో ఉదయం 10.30 నుంచి 11.30 గంటల వరకు. 11కేవీ వాంబేకాలనీ, వీ-గార్డ్, రాక్‌టౌన్, చాణక్యపురి, జీఎస్ఐ, హనుమాన్‌నగర్ ఫీడర్ల పరిధిలోని ప్రాంతాల్లో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు. 11కేవీ విజయానగర్ కాలనీ ఫీడర్ పరిధిలోని కాలనీల్లో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు. 11కేవీ రాఘవేంద్రకాలనీ, మదర్‌డెయిరీ, లెక్చరర్స్ కాలనీ ఫీడర్ల పరిధిలోని కాలనీల్లో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు. 11కేవీ కోహెడ, పసుమాముల ఫీడర్ల పరిధిలో మధ్యాహ్నం 1 నుంచి 2 గంటల వరకు. 11కేవీ కొత్తపేట, న్యూ మారుతీనగర్ ఫీడర్ల పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు. 11కేవీ కల్వంచ, చిత్ర లేఅవుట్, సాయి కాలనీ, విశాలాంధ్ర ప్రెస్, జైపురికాలనీ, రాజీవ్ స్వగృహ ఏ, బీ-బ్లాకుల పరిధిలోని కాలనీలలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని, వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని ఆయన కోరారు.

నియామకం

బడంగ్‌పేట్: బడంగ్‌పేటలో కురుమలు గురువారం సమావేశం నిర్వహించుకొని కురుమ పెద్దల సమక్షంలో సంఘం సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బడంగ్‌పేట కురుమ సంఘం అధ్యక్షుడిగా గౌర సాయికుమార్, ఉపాధ్యక్షులుగా కడారి భిక్షపతి, కొండ్రు చంద్రయ్య, గౌర రాకేశ్ కుమార్, గౌర కొమురయ్య, ప్రధాన కార్యదర్శిగా చిన్నరావుల రవీందర్‌కుమార్, జాయింట్ సెక్రటరీలుగా దొడ్డి వెంకటేశ్, గౌర శ్రీనివాస్, కోశాధికారిగా గౌర శివకుమార్, గౌరవ సలహాదారులుగా గౌర సత్తయ్య, దొడ్డి మల్లికార్జున్, దడిగ ఐలయ్య, కార్పొరేటర్లుగా గౌర రమాదేవి శ్రీనివా స్, గౌర సురేశ్, కార్యవర్గ సభ్యులుగా దండ్ల మహేందర్, గడిగె రాఘవేంద్ర, కడారి నర్సింహ, గౌర వెంకటేశ్, గౌర కుమార్ తదితరులను ఎన్నుకుని, నియామకపత్రం అందజేశారు.

అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి



పనులను పరిశీలిస్తున్న లచ్చిరెడ్డి

ఎల్‌బీనగర్: డివిజన్ పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి పనుల్లో వేగం పెంచి త్వరితగతిన పూర్తి చేయాలని బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని ఏపీఆర్ క్రిస్టల్ విల్లాస్ వద్ద రోడ్డు మరమ్మతు పనులను గురువారం ఆయన పరిశీలించి మాట్లాడారు. స్థానికులకు ఇబ్బందులు తలెత్తకుండా పనులు పూర్తి చేయాలన్నారు. కార్పొరేటర్ వెంట సత్యనారాయణ, శ్యామ్‌సుందర్, విష్ణువర్ధన్‌రెడ్డి ఉన్నారు.

ప్రమాదకరం.. ఎప్పుడో పరిష్కారం?

నాగోలు డివిజన్ పరిధి శ్రీసాయినగర్ కాలనీ రోడ్‌నెంబర్–2లో ఓపెన్ నాలా మ్యాన్‌హోల్ పైకప్పు కుంగిపోయి గుంత ఏర్పడింది. ఈ విషయమై గత 15 రోజులుగా జీహెచ్ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నాలా సుమారు 10 ఫీట్లకు పైగా లోతు ఉంటుందని, రాత్రి సమయంలో ప్రమాదాలు జరిగే ఆస్కారముందని వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

–మన్సూరాబాద్



పేదల పక్షాన పోరాడతాం

సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య

మహేశ్వరం: సీపీఐ పేదల పక్షాన అలుపెరుగని పోరాటాలు చేస్తోందని సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలోని సీపీఐ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశ స్వాతంత్ర్య ఉద్యమం, తెలంగాణ సాయుధ పోరాటాల్లో సీపీఐ కీలక పాత్ర పోషించిందన్నారు. దున్నేవాడికి భూమి అనే నినాదంతో లక్షలాది మంది పేదలకు భూమి పంపిణీ చేయించిన ఘనత సీపీఐ పార్టీది అన్నారు. భవిష్యత్‌లో పేదల పక్షాన మరిన్ని పోరాటాలను చేస్తామన్నారు. అంతకు ముందు పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి దత్తునాయక్, సీపీఐ మండల కార్యదర్శి పల్లాటి యాదయ్య, నాయకులు బ్రహ్మాచారి, రాములు, పుష్పమ్మ, నర్సింహ, యాదయ్య పలువురు పాల్గొన్నారు.



పార్టీ జెండా ఆవిష్కరిస్తున్న జంగయ్య

వైభవంగా క్యాండిల్ సర్వీస్ ఆరాధన

పహాడీషరీఫ్: క్రిస్మస్ వేడుకల్లో భాగంగా పహాడీషరీఫ్ రంగ నాయకుల కాలనీలోని జేరుషలేం కవనెంట్ చర్చిలో బుధవారం రాత్రి క్యాండిల్ సర్వీస్ ఆరాధన వైభవంగా కొనసాగింది. పాస్టర్ రెవరెండ్ ఎ.మున్యా మోజెస్ నాయక్ సంఘ కాపరిగా స్థానిక నాయకులతో ఆరాధన చేయించారు. ముఖ్య అతిథిగా హాజరైన బాలు, భాగ్యరావులు ఏసుక్రీస్తు చరిత్రను వివరించారు. ఈ వేడుకల్లో మాజీ ఎమ్మెల్సీ రాజేశ్వర్‌రావు, క్రిష్టియన్ లీడర్ జెరుషలేం మత్తయితో పాటు ఎర్రబాపు ఇశ్రాయేల్ పాల్గొన్నారు.